గీత కార్మికుల సేఫ్టీ కిట్స్‌ను పరిశీలించిన కలెక్టర్



సేఫ్టీ కిట్స్‌తో తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడిని పరిశీలిస్తున్న అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గీత కార్మికుల కోసం ప్రభుత్వం తయారు చేయించిన సేఫ్టీ కిట్స్‌ను ఆయన పరిశీలించారు. తాటివనంలోకి వెళ్లి గీత కార్మికులు సేఫ్టీకిట్స్‌తో తాటి చెట్టు ఎక్కిదిగడం పరిశీలించారు. సేఫ్టీకిట్స్ గురించి గీత కార్మికులను అగిడి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆదివారం సీఎం చేతుల మీదుగా గీత కార్మికులకు కిట్స్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం, సూపరింటెండెంట్ ఉజ్వలరెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జశ్వంత్‌రెడ్డి, సీఐ అంజిరెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ సరళ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు లబ్ధి: ఎమ్మెల్యే దేవిరెడ్డి



ఎల్ఓసీని ప్రమీల కుటుంబ సభ్యుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడకు చెందిన ఇమ్మడి ప్రమీల కొన్ని రోజుల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. తమ ఆర్థిక పరిస్థితులు బాగలేక కుటుంబ సభ్యులు ఇటీవల ఎమ్మెల్యేను కలిసి వైద్యం కోసం సాయం చేయాలని కోరారు. ప్రమీల మోకాళ్ల ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. గురువారం ఎమ్మెల్యే సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన లక్ష రూపాయల ఎల్ఓసీని ప్రమీల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం లాంటిదని అన్నారు.



షోయబ్ మెమోరియల్ పార్క్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

షోయబ్ మెమోరియల్ పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలి : ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని షోయబ్ మెమోరియల్ పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్‌కు సూచించారు. ఈమేరకు ఆయన షోయబ్ మెమోరియల్ పార్క్‌ను సందర్శించారు. ఇందులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో కొన్ని పరికరాలు పనిచేయనందున వాటికి మరమ్మతులు చేయించి అందరికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే తెలిపారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్ అధ్వానంగా తయారైందని, వాకర్లు వాకింగ్ చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. వాకింగ్ ట్రాక్‌తోపాటు పార్క్ ప్రహరీ గోడకు మెష్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా షోయబ్ మెమోరియల్ పార్క్‌ను పచ్చదనంతో తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనాకు సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షేక్ మోహియుద్దీన్ అబ్రార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

డివిజన్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యం : సుజాత

చంపాపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌ను అన్నివిధాల అభివృద్ధి చేయడమే లక్ష్యం అని కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. డివిజన్‌లోని హనుమాన్‌నగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.77.30లక్షలతో చేపట్టిన సీసీ రహదారి నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హనుమాన్‌నగర్‌కాలనీలో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సీసీ రహదారి పనులు మొదలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ హేమునాయక్, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గంధం శ్రీనివాస్, షాకీర్, మమత, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

చాదర్‌ఘాట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని రామాలయం బస్తీ, గడ్డిఅన్నారం బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. రామాలయం బస్తీలో రూ.4లక్షలతో, గడ్డిఅన్నారంబస్తీలో రూ.30లక్షలతో నూతన సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఆమె వివరించారు. రానున్న బోనాల పండుగ నేపథ్యంలో రోడ్ల నిర్మాణంలో జాప్యం చేయకుండా వెంటనే పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామ మల్లారెడ్డి, వై.సురేందర్, ప్రభాకర్, అమిత్, జీవన్, కిరణ్, ఉమేష్, జీహెచ్ఎంసీ మూసారాంబాగ్ సెక్షన్ ఏఈ రవికాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, శానిటేషన్‌జవాన్ రమేశ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి: రాగుల



వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వనస్థలిపురం డివిజన్ మల్లికార్జుననగర్ కాలనీలోని నూతన పార్కులో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ప్రేమ్ కుమార్, వెంకటేశ్వర్‌రావు, రాజేందర్‌రెడ్డి, కోలన్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

హత్తిగూడచెరువును సందర్శించిన అధికారులు



గతంలో సర్వే చేసి ఇచ్చిన స్కెచ్ రిపోర్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ జానకీ, ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి

హయత్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు హత్తిగూడ చెరువు ఆక్రమణపై హయత్‌నగర్ మండల రెవెన్యూ, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం 11గంటలకు ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, హయత్‌నగర్ తహసీల్దార్ జానకీ, ఇరిగేషన్ ఏఈ తస్వీన్ రజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహయాదవ్, మండల సర్వేయర్ జ్యోతిలు, సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డిలు హత్తిగూడ చెరువును సందర్శించారు. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, సక్రునాయక్‌తో పాటు పలువురు సీపీఐ నాయకులతో కలిసి ఆక్రమణకు గురవుతున్న చెరువు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కబ్జాకు గురవుతున్న చెరువును పరిశీలించారు. కల్వర్టు వద్ద కాల్వను పూడ్చి చదును చేసిన దృశ్యాలను అధికారులు పరిశీలించారు. ఎఫ్‌టీఎల్‌ను పూడుస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఫిర్యాదు చేస్తున్నా చెరువు ఆక్రమణ మాత్రం ఎందుకు ఆగడం లేదని ప్రశ్నించారు. పాత ఎఫ్‌టీఎల్ హద్దులను చెరిపి వేసి కొత్తగా హద్దులు ఏర్పాటు చేయడం వెనుక ఎవరు ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌టీఎల్ ఎలా మారుతుందని అడిగారు. గతంలో నార్త్ ట్యాంకు డివిజన్ అధికారులు చేసిన సర్వే స్కెచ్‌లను చూపించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ అది తప్పుడు రిపోర్టు అని అన్నారు. దానిని పరిగణలోనికి తీసుకోద్దని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ వద్ద కూడా అదే రిపోర్టు ఉందని కార్పొరేటర్, సీపీఐ నాయకులు పాత సర్వే స్కెచ్‌ను చూపించారు. నార్త్ ట్యాంకు డివిజన్, మండల సర్వేయర్ జాయింట్ సర్వే చేయాలని రెండు పార్టీల నాయకులు తహసీల్దార్‌ని కోరారు.



అసూర్‌ఖానా నిర్వాహకులతో మాట్లాడుతున్న డీసీపీ కాంతిలాల్ పాటిల్

ప్రశాంతంగా మొహర్రం నిర్వహిద్దాం: డీసీపీ

సైదాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మొహర్రం, బీబీ కా ఆలం ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. గురువారం అదనపు డీసీపీ స్వామితో కలిసి మాదన్నపేట పీఎస్ పరిధిలోని ఇమామ్‌బడా అసూర్‌ఖానాను సందర్శించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తట్టిఅన్నారం చోరీ కేసులో సెల్‌ఫోన్ ట్విస్ట్

కొత్తపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధిలోని తట్టిఅన్నారం వైఎస్సార్‌కాలనీలో మంగళవారం చోటుచేసుకున్న చోరీ కేసులో పోలీసులకు దొరికిన సెల్‌ఫోన్ మరో దొంగతనాన్ని వెలుగులోకి తెచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వైఎస్సార్ కాలనీలో సుదర్శన్ అనే వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంటిలోని బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. అయితే ఈ చోరీకి ముందు తొలుత హర్షలాల్ అనే వ్యక్తి ఇంటి తాళం విరగొట్టి అక్కడ సిమ్‌కార్డు లేని పాత సెల్‌ఫోన్‌ను అపహరించారు. కాగా, పోలీసులను పక్కదారి పట్టించేందుకు సుదర్శన్ ఇంట్లో చోరీ చేసిన దొంగలు తర్వాత హర్షలాల్ ఇంటిలో చోరీకి పాల్పడిన సెల్‌ఫోన్‌ను సుదర్శన్ ఇంటిలో వదిలివెళ్లారు. అయితే సుదర్శన్ ఇంట్లో చోరీ వివరాలు సేకరించే సమయంలో స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ దొంగలదే అయి ఉంటుందని పోలీసులు భావించారు. కాగా, సాంకేతికతను ఉపయోగించి సెల్‌ఫోన్ హర్షలాల్‌కు చెందినదని గుర్తించారు. ఈ మేరకు సోలాపూర్‌కు వెళ్లిన హర్షలాల్‌కు సమాచారం ఇచ్చారు. గురువారం తెల్లవారు జామున తట్టి అన్నారానికి చేరుకున్న అతడు తన ఇంటి తాళం విరగ గొట్టి ఉండడంతో ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఇంటికి చేరుకుని పోలీసులు కంగుతిన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 11 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

చాదర్‌ఘాట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మలక్‌పేట పోలీసుల సంయుక్తాధ్వర్యంలో గురువారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ జీ.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట వెంకటాద్రినగర్‌కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మలక్‌పేట పోలీసులతో కలిసి దాడిచేశారు. పేకాట నిర్వాహకుడు రమేష్‌తోపాటు మరో 11మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.03లక్షల నగదు, 11మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపకమిషనర్ సుజాత, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఎల్‌బీనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో దోమల నివారణపై జీహెచ్ఎంసీ అధికారులు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం బొమ్మనగండిలోని ప్రభుత్వ పాఠశాల, సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తపేటలోని జడ్పీహెచ్ఎస్‌లలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలలో జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత, కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణిఅంజన్, నయకోటి పవన్‌కుమార్, ప్రాజెక్ట్ అధికారి విక్రాంత్‌రెడ్డి, శానిటేషన్ డీఈ నీలిమ, ఏఈ మాత్యనాయక్, ప్రశాంతి, సీఓలు సహదేవ్, శోభన పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమని, వెంటనే వాటిని విడుదల చేసి విద్యార్థుల ఉన్నత చదువులను ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 5 సంవత్సరాల నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8వేల కోట్లకు చేరుకున్నాయని, కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సైతం విద్యార్థుల చదువు విషయమై అశ్రద్ధ చూపడం సరికాదని అన్నారు. వెంటనే నిధులను విడుదల చేయకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ కార్యదర్శి అశోక్‌రెడ్డితో పాటు ప్రతినిధులు లెనిన్, స్టాలిన్, చరణ్‌శ్రీ, సునీల్, విఘ్నేష్, వంశబూ పాల్గొన్నారు.


బీఎన్ఎస్ చట్టాలను నిరసిస్తూ ఆందోళన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కడారి రాములు, ఇతర నేతలు

ఎల్‌బీనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బీఎన్ఎస్ చట్టాలను నిరసిస్తూ ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట చౌరస్తా సమీపంలో ఆటో స్టాండ్ దగ్గర గురువారం ఆటో డ్రైవర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కడారి రాములు, సరూర్‌నగర్ సర్కిల్ నేత మల్లెపాక వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలు సామాన్యులకు గుదిబండగా మారాయన్నారు. ప్రమాదాలకు ఆటో డ్రైవర్లను బాధ్యులను చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ చట్టాల వల్ల అమాయకులు శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. కొత్త చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

త్వరలో దివ్యాంగులకు తీపికబురు: వీరయ్య



మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే దివ్యాంగులకు తీపికబురు చెప్పనుందని ఉన్నత విద్యా సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్లు, వయస్సు సడలింపునకు జీఓ ప్రవేశపెట్టనున్నట్లు వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. గురువారం మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కొన్నేళ్లుగా సమస్యల పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పుడు అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దివ్యాంగులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇవ్వడంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌కు షాక్ :18 మందికి స్వల్ప అస్వస్థత

పహాడిషరీఫ్ : సరదా కోసం ఈత కొలను లో దిగితే ప్రాణాపాయం తప్పి గాయాల పాలైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జల్‌పల్లి మునిసిపాలిటీ పరిధిలోని జల్‌పల్లిలో గురువారం సాయంత్రం మరా ఠా భవన్ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఓ కుటుంబం విందు చేసుకుం ది. అనంతరం ఫామ్‌హౌస్ ప్రాంగణంలోని స్విమింగ్‌పూల్‌లో 18మంది సరదాగా ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో స్విమింగ్‌పూల్‌పై నుంచి ఉన్న హైటెన్షన్ వైర్లు గాలికి కింద ఉన్న ఈత చెట్టు కొమ్మకు తగలడంతో కాలిపోయింది. దీంతో ఈత చెట్టుకు తాకిన వైర్ల ద్వారా స్విమింగ్‌పూల్‌లోపలికి ఎర్త్ రావడంతో ఈత కొడుతున్న వారు విద్యుత్ షాక్‌కు గురయ్యా రు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మైలార్ దేవ్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వారిని తరలించారు. ప్రస్తుతం అందులో 16 మంది డిశార్జి కాగా.. ఇద్దరు చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వొద్దు..



విద్యుత్ సంస్థ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో యూనియన్ అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ సౌత్ సర్కిల్‌లో కరెంటు చోరీ జరుగుతున్నదని, బిల్లులు సరిగ్గా కట్టడం లేదని, ఆదాయం తక్కువగా ఉందని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు చూడడం సరికాదన్నారు. సంస్థ బిల్లుల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ఉద్యోగులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రాజకీయాలకు తలొగ్గకుండా డీపీఈ, విజిలెన్స్‌లను వినియోగించుకుంటూ పని చేస్తే తమ యూనియన్‌తో పాటు అన్నియూనియన్లు సహకరిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని ఉద్యోగులు పోరాడుతున్న నేపథ్యంలో ప్రైవేటు సంస్థలకు సౌత్ సర్కిల్‌ను కట్టబెట్టే ప్రయత్నాలని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు పోస్టుబాక్స్‌లు అందజేత



ఎంపీ ఈటలకు పోస్టుబాక్స్‌ను అందజేస్తున్న భరత్ సంఘం

చంపాపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం(ఎల్‌పీడీఓ)చైర్మన్ భరత్ సంఘం వేర్వేరుగా పోస్టుబాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి పోస్టుబాక్స్ నినాదంను చట్టసభల్లో ఎంపీ, ఎమ్మెల్యే ప్రస్తావించనున్నట్లు తెలిపారు. స్థానిక ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. 15సంవత్సరాల కిందట పోస్టు ద్వారానే ప్రతి ఒక్కరూ ఉత్తరాలను పంపేవారని, నేడు సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వచ్చిన తర్వాత పోస్టుబాక్స్‌లు కనుమరుగైనట్లు తెలిపారు. ఇంటింటికీ పోస్టుబాక్స్‌లను పంచుతున్న భరత్‌సంఘంను ఎంపీ, ఎమ్మెల్యేలు అభినందించారు.

సరూర్‌నగర్‌లో పర్యటించిన జడ్సీ, కార్పొరేటర్



సరూర్‌నగర్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఎల్‌బీనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతానని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చెప్పారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌తో కలిసి డివిజన్ పరిధిలోని జేబీకాలనీ, విజయపురికాలనీ, పోచమ్మబాగ్, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. జేబీకాలనీలో వర్షపునీటి నాలా పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ను కోరారు. విజయపురికాలనీలో వర్షపునీటి నాలా పనులు చేపట్టాలని కోరారు. పోచమ్మబాగ్‌లో రోడ్డు పనులను భగత్‌సింగ్‌నగర్‌లో జీడీ పాయింట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన జడ్సీని కోరారు. ఈ పర్యటనలో సరూర్‌నగర్ ఉప కమిషనర్ సుజాత, శానిటేషన్ డీఈ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న రాజశేఖర్

జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్, కవితల పోటీలు

హయత్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డైరక్టర్ ఆఫ్ ఎన్‌సీసీ తెలంగాణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశం మేరకు తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకోవడం అనే అంశాలపై జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్, కవితల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎన్‌జీసీ ప్రాజెక్టు అధికారి రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల, పర్యావరణం కలుషితం కావడం వల్లనే ప్రజల ఆరోగ్యం చెడిపోతుందన్నారు. అడవులను నరికి వేయడం వల్ల అడవులు ఎడారిలా మారుతున్నాయని అన్నారు. వాతావరణంలో జరుగుతున్న మార్పుల వల్ల కరువు, కాటకాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావుతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కేఎల్లార్

ఎల్‌బీనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చెప్పారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని హరిపురికాలనీ, శ్రీరామకృష్ణాపురం కాలనీలలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక మధుసూదన్‌రెడ్డి, పున్న గణేష్, బండి మధుసూదన్‌రావు, సురేంద్ర కుమార్, నానవాల జ్ఞానేశ్వర్‌యాదవ్, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పాతాళభైరవి నాటక ప్రదర్శన



పాతాళభైరవి నాటక ప్రదర్శనలో సురభి కళాకారులు

వనస్థలిపురం : శ్రీవినాయక నాట్య మండలి సురభి ఆధ్వర్యంలో వనస్థలిపురం ఓపెన్ ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్న ఆషాడమాస నాటకోత్సవాలు ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా గురువారం సాయంత్రం ప్రదర్శించిన పాతాళభైరవి నాటక ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు సురభి వేణుగోపాల్ మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సురభి నాటకాలు ప్రదర్శిస్తే కోలాహలంగా ఉండేదన్నారు. కళనే నమ్ముకున్న తమలాంటి కళాకారులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆషాడ బోనాలకు అన్ని ఏర్పాట్లు : కార్పొరేటర్



అల్తాఫ్‌నగర్‌లో పర్యటిస్తున్న ఉపకమిషనర్ జకియా సుల్తానా, కార్పొరేటర్

ఎల్‌బీనగర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం బోనాలను పురస్కరించుకుని కాలనీలు, బస్తీలలో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను తొలగించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎల్బీనగర్ సర్కిల్ ఉపకమిషనర్ జకియా సుల్తానాతో కలిసి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని అల్తాఫ్‌నగర్‌లో పర్యటించి పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. ఎక్కడ సమస్య ఉన్నా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ వెంకటేశం, ఎంటమాలజి, విద్యుత్, శానిటేషన్, శివరేజ్, మాన్సూన్, రాంకీ సిబ్బందితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.